క్లుప్తంగా

1,545 క్యూసెక్కుల నీటి విడుదల



కేసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

పాములపాడు: మండలంలోని శాంతినిలయం గ్రామ సమీపంలో కేసీ కెనాల్ 120వ కిలోమీటరు లాక్ ఇన్స్‌లా నుంచి ఆదివారం 1545 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎగువ నుంచి వస్తున్న మొత్తం నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. లాక్ ఇన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 587 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్ చానల్ (కేసీసీ)కి 630 క్యూసెక్కులు, అలగనూరు రిజార్వాయర్‌కు 328 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.

వీబీఆర్‌కు 16వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

వెలుగోడు: కృష్ణా జలాలు వెలుగోడు రిజర్వాయర్‌కు వచ్చి చేరుతున్నాయి. బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింక్ చానల్ ద్వారా వీబీఆర్‌కు ఆదివారం 16,250 క్యూసెక్కులు వచ్చి చేరాయి. దీంతో వీబీఆర్ నుంచి తెలుగు గంగ మద్రాస్ కాల్వకు 4,500 క్యూసెక్కులు, ఎస్ ఆర్ తూముకు 50 క్యూసెక్కులు, ఎస్ ఎల్ తూముకు 30 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. వీబీఆర్‌లో ప్రస్తుతం 9.621 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఏఈ శివనాయక్ తెలిపారు.

అలరించిన భక్తిరంజని



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణమాఢ వీధిలోని నిత్యకళావేదికపై నల్గొండకు చెందిన జి.వి.ఆర్.మ్యూజిక్ ఇన్స్టిట్యూషన్ వారు నిర్వహించిన భక్తిరంజని కార్యక్రమం భక్తులను అలరించింది. కార్యక్రమంలో గణేశ పంచరత్నం, భో శంభో, రాజరాజేశ్వరి, ఓం నమోనమ నటరాజా, శివపంచాక్షరి, కాశీవిశ్వనాథాష్టకం, శివాష్టకం, శివస్తోత్రం తదితర గీతాలు, అష్టకాలను ఆద్య, కిరణ్, శ్యాం, సాన్విరెడ్డి, అంగుళిక, దాక్షయణి, సిద్దార్థ, జయ, శ్రీవాణిదేవి, వినోదాదేవి ఆలపించారు.

అనారోగ్యంతో తలారి మృతి



తలారి లాల్‌బీ (ఫైల్)

నందికొట్కూరు: మండల పరిధిలోని మల్యాల గ్రామ రెవెన్యూ సహాయకురాలు లాల్‌బీ(80) అనారోగ్యంతో ఆదివారం వేకుజామున మృతి చెందింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ కార్యాలయ ఆర్ఐ శ్యామలాదేవి కుటుంబసభ్యులకు మట్టి ఖర్చులకు రూ.25 వేలు అందించారు. అంతేగాకుండా గ్రామ రెవెన్యూ సహాయకులు బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 వేలు అందజేశారు. లాల్‌బీ మృతికి సంతాపం తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



అస్లాంబాషా (ఫైల్)

మిడుతూరు: స్థానిక మైనార్టీ కాలనీకి చెందిన ఓ యువకుడు కనిపించడం లేదని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి కేసు నమోదైనట్లు ఎస్ఐ జగన్‌మోహన్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన అస్లాం బాష పీఎస్‌కే కంపెనీలో పనిచేసేందుకు 31వ తేదీ సాయంత్రం 4:30 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లాడు. ఆగస్టు 1వ తేదీన తన భార్య ముంతాజ్‌కు ఫోన్ చేసి ఆలస్యంగా ఇంటికి వస్తానని చెప్పాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తుంది. చుట్టుపక్కల విచారించినా ఆచూకీ లభించలేదని తెలిపారు. దీంతో అన్న హంజద్ బాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

పాములపాడు: ఎస్సీ వర్గీకరణ భారత రాజ్యాంగానికి వ్యతిరేకమని మాల మహానాడు జిల్లా నాయకులు అబ్రహాం, అంకన్న అన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2004లో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ఐదుగురు జడ్జీల బెంచ్ తోసిపుచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఏడుగురు జడ్జీల బెంచ్ వర్గీకరణ సమంజసమని తీర్పునిచ్చిందని, దీనిపై దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు, అంబేడ్కర్ వాదులు స్పందించాలని కోరారు. మన జాతి కోసం, మన బిడ్డల భవిష్యత్తు కోసం అందరూ ఐకమత్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని, ఈ నెల 21న తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆ సంఘం నాయకులు రాజు, ఎర్రన్న, మల్లయ్య, నగేష్, క్రిష్టఫర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.











పాములపాడు, కొత్తపల్లి, నందికొట్కూరు, ఆత్మకూరు, వెలుగోడులో విశేష అలంకరణలో చౌడేశ్వరీదేవి

ఘనంగా చౌడేశ్వరి దేవి జయంతి



నందికొట్కూరు: దీపాలంకరణలో చౌడేశ్వరిదేవి ఆలయం



మిడుతూరు: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



ఆత్మకూరులో తొట్ల ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మిడుతూరు: స్థానిక చౌడేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలను తొగట వీర క్షత్రియుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఆషాఢ మాసంలో అమావాస్య రోజున అమ్మవారి జయంతి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఉదయం అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు భూవనకుండ ఎత్తుకొని సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలు నిర్వహించారు. తొగట వీర క్షత్రియుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తొగటవీర క్షత్రియులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పాములపాడు: ఆషాఢ బహుళ అమావాస్య ఆదివారం శ్రీచౌడేశ్వరీ దేవి జయంతి ఉత్సవం మండలంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి నూతన వస్త్రాలంకరణతో పాటు పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, తీర్థ ప్రసాద వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు, కాయ, కర్పూరాలతో, పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలు సమర్పించారు. ఆలయ పురోహితులు కోదండ రామయ్య భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరి దేవికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి పూజాక్రతువులు చేపట్టారు. భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తాదులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొగట వీర సేవా సంఘం సభ్యులు, మహిళలు, పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.

నందికొట్కూరు: నియోజకవర్గ ప్రజలపై చౌడేశ్వరీదేవి అనుగ్రహం ఉండాలని కోరుకుంటునట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చింతా రామకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో కమిటీ అధ్యక్షుడు, సభ్యులు అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నియోజకవర్గంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు మంచిగా పండించేందుకు అమ్మవారి ఆశీస్సులు మెండుగా అందించాలని కోరుకున్నట్లు చెప్పారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: స్థానిక చౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారి జయంతి సందర్భంగా ఆదివారం అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. ఉదయం ఆలయ కమిటీ నిర్వాహకులు మారుబోతుల రామకృష్ణ, శివశంకర్ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామున ప్రత్యేక అలంకరణతో పాటు అభిషేకాలు, కుంకుమార్చన, శ్రీలక్ష్మీ గణపతిహోమం, క్షీరాభిషేకం, శ్రీసూక్త హోమం, లలితాహోమం, నవగ్రహసహిత, బలిదాన కార్యక్రమాలు నిర్వహించారు. తోటగేరి వీధుల్లో భక్తులు తొట్లోత్సవం చేపట్టారు. మధ్యాహ్నం తోటగేరి, మెయిన్‌బజారు మీదుగా మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. అనంతరం దుర్గా హోమంలో పాల్గొన్నారు.

వెలుగోడు: పట్టణంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో ఆషాఢ బహుళ అమావాస్యను పురస్కరించుకొని చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి, దేవి ఖడ్గములతో కుంకుమార్చన పూజలు చేపట్టారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆలయ భూములకు వేలం నిర్వహించాలి



మల్యాల పొలిమేరలో ఆలయ భూములను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: మల్యాల గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, శివుడి ఆలయాల భూములకు అధికారులు ఎందుకు వేలం నిర్వహించడం లేదని సీపీఎం నాయకులు ఫక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ ప్రశ్నించారు. వారు ఆదివారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో ఆలయాల భూములను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ఆలయాల భూములకు వేలంపాట నిర్వహించకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. ఏటా ఖరీఫ్ ప్రారంభంలోనే ఆలయాలకు చెందిన 70 ఎకరాలకు ఎండోమెంట్ అధికారులు వేలం పాటలు నిర్వహించేవారన్నారు. ఈ ఏడాది అధికారులు వేలం ఎందుకు నిర్వహించలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దేవుడి మాన్యం భూములు బీడుగా మారినా అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. లేని పక్షంలో పేదలను సమీకరించి ఆలయ భూములను సాగు చేస్తామని స్పష్టం చేశారు. వీరి వెంట రైతులు వడ్డె వెంకటస్వామి, చిన్ని సవారి, చిన్ని బాషా, శేషు నాయుడు, మాసన్న, టీ.శంకరయ్య, రామదాసు, గోవిందు, తదితరులు ఉన్నారు.

చెంచులకు టార్పాలిన్ పట్టలు అందజేత



చెంచుల పూరి గుడిసెలపై పట్టాలు కప్పుతున్న రెడ్‌క్రాస్, కొమరం భీం సభ్యులు

శ్రీశైలం : క్షేత్ర పరిధిలోని మాణిక్యేశ్వరి మాత ఆశ్రమ సమీపంలోనున్న చెంచుగూడెంలో చెంచులకు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఆదివారం టార్పాలిన్ పట్టాలు అందజేశారు. వర్షాకాలం కావడంతో పూరిగుడెసెల్లో చెంచులు పడుతున్న అవస్థలను కొమరం భీమ్ ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ శాఖ గౌరవ అధ్యక్షుడు యు.ఆశీర్వాదం స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ బ్రాంచ్ మేనేజర్ నాగశేషు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి రాష్ట్ర శాఖ చైర్మన్ దస్తగిరి, వైస్ చైర్మన్ మారుతి కుమార్‌ను సంప్రదించి వెంటనే గుడిసెలపై వేసుకునేందుకు టార్పాలిన్ పట్టలతో పాటు, గిరిజన పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం, సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు పంపించారు. స్థానిక డాక్టర్ ప్రసాద్ గిరిజనులకు వాటిని పంపిణీ చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. భాస్కర్, మల్లికార్జున, ముత్యాలు, గౌస్, రవికుమార్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ వెంచర్లు



తరిగోపులలో అక్రమంగా వేసిన వెంచర్

జూపాడుబంగ్లా: గ్రామపంచాయతీ అనుమతుల్లేకుండా మండలంలోని తరిగోపుల గ్రామంలో ఇళ్ల స్థలాల వెంచర్ వేసి యథేచ్ఛగా ప్లాట్లు విక్రయిస్తున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. గ్రామరెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 285లోని పొలంలో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. పొలాన్ని ల్యాండ్ కన్వర్షన్ చేయించడంతో పాటు గ్రామపంచాయతీ అనుమతులు తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. అలాగే జీఓ నంబర్ 145 ప్రకారంగా వెంచర్‌లో 5 శాతం స్థలాన్ని గ్రామ పంచాయతీకి కేటాయించాలి లేదా అందుకు సమానమైన మొత్తాన్ని గ్రామపంచాయతీకి చెలానాగా చెల్లించాల్సి ఉంటుంది. అధికారుల వద్ద లేఅవుట్ అప్రూవల్ తీసుకొన్న తర్వాత వెంచర్ ఏర్పాటుచేసి ప్లాట్లను విక్రయించుకోవాల్సి ఉంటుంది. ఇవేవీ లేకుండా యథేచ్ఛగా ప్లాట్లు విక్రయిస్తున్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శాంతయ్యను వివరణ కోరగా ఇప్పటిదాకా తమ వద్ద వెంచర్ ఓనర్ ఎలాంటి అనుమతులు తీసుకోలేదన్నారు. విచారణ జరిపి వెంచర్ వేసిన వారికి నోటీసులు జారీచేస్తామని, సరైన సమాధానం ఇవ్వకపోతే ప్లాట్ల కోసం పాతిన రాళ్లను తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి శాంతయ్య తెలిపారు.

విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు: ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్‌లో విజయనగరంలో జరిగే ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకలు, 20వ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవతం చేయాలని కోరారు. జీవో నం.117ను రద్దు చేసి, ప్రతి పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియంను కొనసాగించాలని, పదో తరగతి విద్యార్థులు మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షలను తెలుగు మీడియంలో రాసుకునే అవకాశం కల్పించాలన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.మధుసూదనరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, నగిరి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మరియానందం, సహాధ్యక్షుడు షేక్ ఉమర్, నాయకులు శ్రీరాములు, దాసు, జాల రామ్మూర్తి, పుల్లయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం



చిన్నారులతో కలిసి మొక్క నాటుతున్న దృశ్యం

శ్రీశైలం: నాటిన మొక్కలను సంరక్షించాలని వక్తలు విద్యార్థులకు సూచించారు. క్షేత్ర పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. శ్రీశైల హిందూ క్షేత్ర పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పర్యావరణాన్ని మొక్కలను నాటారు. మామిడి గానుగ వేప, చింత, బిల్వ మొక్కలు, నేరేడు, నిమ్మ, జామ మొక్కలను నాటి వాటికి దేశభక్తుల పేర్లు పెట్టారు. మొక్కలను అందజేసిన దేవస్థానం ఈవో పెద్దిరాజు, దేవస్థానం ఈఈ రామకృష్ణకు సమితి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

పంట నమోదు చేసుకోండి

కొత్తపల్లి: ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏఓ మహేష్ ఆదివారం ప్రకటనలో సూచించారు. మండలంలో మొక్కజొన్న, పత్తి, కంది, మినుము, సోయాబీన్స్‌తో పాటు వరి పంటను రైతులు సాగుచేశారని పేర్కొన్నారు. వీరందరూ రైతుసేవా కేంద్రాలలో ఆన్‌లైన్‌లో పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు చేయించుకుంటునే రైతులకు పెట్టుబడి సాయం, పంట ఇన్సూరెన్స్, నష్ట పరిహారం వంటి పథకాలు వర్తిస్తాయని వివరించారు. దరఖాస్తు చేసుకునే రైతులు పొలం పాస్‌బుక్, 1బీ, రైతు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంటు, అప్లికేషన్ ఇచ్చి నమోదు చేయించుకోవాలని సూచించారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న మోడల్‌స్కూల్ వార్డెన్ లలితమ్మను సస్పెండ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. మోడల్‌స్కూల్ హాస్టల్‌లో వార్డెన్ అందుబాటులో ఉండడం లేదని, అలాగే విద్యార్థినులకు మెనూ ప్రకారంగా భోజనం అందించడం లేదన్నారు. దీనిపై వార్డెన్‌కు ఫోన్‌చేసి మాట్లాడేందుకు యత్నించగా స్విచ్చాఫ్ వస్తున్నట్లు తెలిపారు. విషయాన్ని ప్రిన్సిపాల్ రమేష్ దృష్టికి తీసుకెళ్లగా వార్డెన్ సెలవు పెట్టలేదని, ఇంటికి వెళ్తున్నట్లు అనుమతి కూడా తీసుకోలేదని చెప్పారన్నారు. ఈ విషయాన్ని డీఈఓ సుధాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. హాస్టల్లో జరుగుతున్న అవకతవకలపై జిల్లా విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

జయప్రదం చేయండి

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ నాయకుల 30 ఏళ్ల పోరాటాలను గుర్తుచేసుకుంటూ సోమవారం నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు డాక్టర్ కే.రాజు మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అనేక రకాల ఉద్యమాలు చేసిందని గుర్తుచేశారు. విజయోత్సవ ర్యాలీలో ఎమ్మార్పీస్ నాయకులు, సభ్యులు మాదిగ సోదరులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజన్న, రగడ, నాగరాజు, దిబ్బన్న, పుల్లంరాజు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

షడ్రక్, రాజయ్య ఆశయాలను సాధిద్దాం



మాట్లాడుతున్న రాజశేఖర్

ఆత్మకూరు: ప్రజాసేవకే అంకితమైన కామ్రేడ్ షడ్రక్, సున్నం రాజయ్య ఆశయాలను సాధిద్దామని సీపీఎం పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, సీనియర్ నాయకులు రాజశేఖర్, నరసింహానాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో షడ్రక్, సున్నం రాజయ్య 4వ వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి సేవలను కొనియాడారు. నాయకులు మంజుల, పి.సుధాకర్, ఎస్.స్వాములు, దినేష్, వీరన్న, గణపతి, ఎ.కలిముల్లా, బి.ఎస్.వలి, చాంద్ పాల్గొన్నారు.

బరక సంజీవరాయ స్వామికి ప్రత్యేక పూజలు





పూజలందుకుంటున్న బరక సంజీవరాయ స్వామి, స్వామికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన బరక సంజీవరాయ స్వామికి ఆదివారం అమావాస్య పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ, ఆవరణంలో మన్యసూక్త హోమం తదితర విశేష పూజలను ఆలయ అర్చకులు నరహరి శర్మ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయం నుంచి స్వామివార్లను పల్లకీలో ఆశీనులు చేసి మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. చెరుకుచెర్ల గ్రామస్థులు ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ మురళీమోహన్ రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల నియామకం



బైకాటి శ్రీనివాసులు

నందికొట్కూరు: మండల తహసీల్దార్‌గా బైకాటి శ్రీనివాసులును నియమిస్తూ జిల్లా కలెక్టర్ రాజకుమారి శనివారం ఆర్డర్ కాపీ ఇచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల ముందు ఆయన నంద్యాల తహసీల్దార్‌గా పని చేశారు. ఎన్నికల సందర్భంగా అధికారులు వైఎస్సార్ జిల్లాకు బదిలీ చేశారు. ఎన్నికల అనంతరం సొంత జిల్లా నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేసుకోగా నందికొట్కూరు తహసీల్దార్‌గా నియమించారు. సోమవారం ఉదయం తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టనునట్లు సమాచారం.



శివరాముడు

పగిద్యాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న నాగేశ్వరరావు సొంత జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో శివరాముడును నియమిస్తూ జిల్లా కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో ప్యాపిలి తహసీల్దార్‌గా పనిచేసి ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు జిల్లా చౌడుపల్లి మండలానికి వెళ్లారు. ప్రస్తుతం పగిద్యాల తహసీల్దార్‌గా నియమితులయ్యారు.

కొత్తపల్లి: మండల తహసీల్దార్‌గా జి.ఉమారాణి రానున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఆదివారం వెలువడ్డాయి. ఆత్మకూరు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఈమెను సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా చిత్తూరు జిల్లా కూడేరు మండలానికి బదిలీ చేశారు. ప్రస్తుతం కొత్తపల్లి తహసీల్దార్‌గా నియమించారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా తహసీల్దార్‌గా వి.చంద్రశేఖర్‌నాయక్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీచేసినట్లు డీటీ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ గతంలో వి.చంద్రశేఖర్‌నాయక్ కొత్తపల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లాకు వెళ్లారు. ప్రస్తుతం జూపాడుబంగ్లా తహసీల్దార్‌గా నియమితులైనట్లు చెప్పారు.

మిడుతూరు: మిడుతూరు తహసీల్దార్‌గా టి.శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ షానవాజ్ ఆదివారం తెలిపారు. గడివేముల మండల తహసీల్దార్‌గా ఉన్న ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా ఐరాల మండలానికి వెళ్లారు. అక్కడి నుంచి మిడుతూరు తహసీల్దార్‌గా బదిలీపై రానున్నట్లు వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

పాములపాడు: మండలంలోని బానుముక్కల గ్రామ సమీపంలోని ఈదుల వాగులో బోయ మధు(24) అనే యువకుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. బోయ నరసింహులు, జయమ్మల కుమారుడు మధు గత జూలై 31న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లు, తెలిసిన వారి వద్ద విచారిస్తున్నారు. ఈ క్రమంలో ఈదుల వాగులో మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా శరీరంపై దుస్తులు లేవు. కుడి చేతికి కడెం, మొలతాడు మాత్రమే ఉన్నాయి. గుర్తుపట్టలేని విధంగా ముఖం కుళ్లిపోయింది. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు అక్కడికి చేరుకొని మృతుదేహం తమ కుమారుడిదిగా గుర్తించారు. ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణం, ఎస్ఐ అశోక్‌లు వివరాలు సేకరించారు. తండ్రి నరసింహులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

కిక్కిరిసిన ముక్కంటి క్షేత్రం



మల్లన్న దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం కలగలసి వెలసిన మహాపుణ్యక్షేత్రం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఇల కైలాసమైన శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రీశైలం డ్యాం క్రస్ట్‌గేట్ల నుంచి సాగర్‌కు నీటి విడుదల కొనసాగుతుండడంతో కృష్ణమ్మ పరవళ్లను చూసేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. శ్రీగిరి చేరుకున్న భక్తజనం వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, మల్లన్న దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా టికెట్టు పొందిన పలువురు భక్తులు మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థాన అధికారులు వీఐపీ బ్రేక్ దర్శనాలను నిలుపుదల చేశారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.